సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 30 । జూన్ । 2023



స్విచ్ ఆపేదేలే..!

వేసవిలో జనం విద్యుత్‌ను తెగ వాడేశారు. ఉక్కపోతతో విద్యుత్ డిమాండ్ పెరిగింది.

- 8లో



70 మందిపై బైండోవర్..?

జిల్లా కేంద్రంలో 70 మందిపై బైండోవర్ పెట్టనున్నట్టు సమాచారం. వీరు గంజాయి బ్యాచ్ అని భోగట్టా.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	34°	25°
ఇచ్ఛాపురం	35°	24°
పాతపట్నం	34°	26°
శ్రీకాకుళం	35°	26°

న్యూస్‌రీల్

రిమ్స్‌లో ఒకరి సస్పెన్షన్.. ఇద్దరికి షోకాజ్

శ్రీకాకుళం : శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో ఒకరిని సస్పెండ్ చేయగా మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పలాసలో ఏర్పాటు చేసిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో ఉద్యోగాల భర్తీకి సంబంధించి రూపొందించిన మెరిట్ జాబితాపై నిర్లక్ష్యం వహించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. నిబంధనల మేరకు దరఖాస్తుదారుల వయో పరిమితి 18 ఏళ్లు నిండి ఉండాలి. అయితే ముగ్గురు అభ్యర్థుల వయసు తక్కువగా ఉన్నప్పటికీ జాబితా రూపొందించిన ముగ్గురు సూపరింటెండెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఈ ముగ్గురికి మెరిట్ జాబితాలో స్థానం కల్పించారు. ఆ తర్వాత పొరపాటును గుర్తించిన అధికారుల దృష్టికి తీసుకెళ్లకపోగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందిన తర్వాత వారు ప్రశ్నించడంతో జరిగిన పొరపాటును అంగీకరించారు. కలెక్టర్ దీనిపై పూర్తి నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను కోరగా.. ఆయన ఇచ్చిన నివేదిక మేరకు సీనియర్ అసిస్టెంటు ఉదయలక్ష్మిపై చర్యలు తీసుకున్నారు. సూపరింటెండెంట్లు సన్యాసినాయుడు, సింహాచలంకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

వారంరోజుల సెలవుపై రిమ్స్ ఆర్ఎంఓ

శ్రీకాకుళం : శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి ఇన్‌చార్జి ఆర్ఎంఓ డాక్టర్ శంకరరావు వారంరోజుల సెలవుపై వెళ్లారు. రిమ్స్‌లో అనేక వివాదాస్పద సంఘటనలకు కేంద్రబిందువుగా ఉన్న ఆయన బుధవారం మీడియా ప్రతినిధులతో సైతం అనుచితంగా వ్యవహరించి, స్పీకర్ ఆదేశాలను ధిక్కరించిన విషయం పాఠకులకు విదితమే. ఈయనను సరెండర్ చేస్తున్నట్లు బుధవారం రాత్రి ఉత్తర్వులు వెలువడినా కొన్ని పరిస్థితుల్లో దాన్ని పెండింగ్‌లో పెట్టారు. గురువారం ఉదయం నుంచి వారంరోజుల పాటు సెలవు పెడుతున్నట్లు సూపరింటెండెంట్‌కు చెప్పి ఆయన వెళ్లిపోయారు. సరెండర్‌పై ఆయన ఫిర్యాదు చేస్తానని చెప్పినట్లు రిమ్స్ వర్గాలు తెలిపాయి.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణంలో భాగంగా యజ్ఞోపవీతాన్ని చూపిస్తున్న అర్చకులు రంజిత్ శర్మ

అరసవల్లి: శ్రీ ఉషా పద్మిని ఛాయాదేవి అమ్మవార్లతో సూర్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవం గురువారం ఉదయం స్థానిక అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. ఆషాడ శుద్ధ (శయన ఏకాదశి) ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణ ప్రక్రియను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. అనివెట్టి మండపంలో వేంచేపజేసిన కల్యాణమూర్తుల కల్యాణ సేవలో పలువురు భక్తులు రూ.500 చెల్లించి పాల్గొన్నారు. వీరికి స్వామి శేషవస్త్రాలతో పాటు కల్యాణ తలంబ్రాలను అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న ఆమదాలవలస సీఐ పైడయ్య

ఆమదాలవలస: భువనేశ్వర్ నుంచి కేరళకు గంజాయిని తరలిస్తున్న ముఠా సభ్యులను బుధవారం అరెస్టు చేసి గురువారం కోర్టుకు తరలించామని ఆమదాలవలస సీఐ పైడయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గంజాయి ముఠా సభ్యులు ఆమదాలవలసలో ఓ లాడ్జిలో ఉన్నారని, ఇక్కడ వేరే రైలు ఎక్కేందుకు వేచి చూస్తున్నారని ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణకు సమాచారం అందింది. దీంతో సాయంత్రం 5 గంటల సమయంలో దాడులు చేశారు ఈ దాడిలో వస్‌వే జంక్షన్ వద్ద ఈ ముఠాలో ముగ్గురు సభ్యులను పట్టుకుని వారి వద్ద ఉన్న సుమారు 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేరళ రాష్ట్రం, మలాపురం జిల్లాకు చెందిన మహమ్మద్ సాహల్, మసూద్ కరన్ చెరి, అఫ్సాల్ వలక్కల్ అనే ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరు భువనేశ్వర్‌లో గంజాయి కొనుగోలు చేసి కేరళ రాష్ట్రంలో విక్రయించేందుకు వెళ్తున్నారని సీఐ చెప్పారు. ఈ గంజాయి విలువ రూ. 75 వేలు ఉంటుందని తెలిపారు. వీరితో పాటు మరో ముగ్గురు కూడా ఉన్నారని, వారు తప్పించుకుని పారిపోయారని, వారిని కూడా పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని సీఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు



బక్రీద్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మసీదుల్లో గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని జీటీ రోడ్డులో ఉన్న జామియా మసీదులో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జామియా మసీదు ముఫ్తీ జియాఉల్ రహమాన్, ఇమామ్ అబ్దుల్ వహాబ్‌లు అందరి చేత నమాజులు చేయించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని 'ముబారక్' చెప్పుకున్నారు.

- శ్రీకాకుళం కల్చరల్



మసీదులో ముస్లింలతో స్పీకర్ తమ్మినేని సీతారాం

'త్యాగానికి ప్రతీక బక్రీద్'

త్యాగానికి ప్రతీకగా ఈదుల్–అదా (బక్రీద్) పండుగ నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. బక్రీద్ సందర్భంగా గురువారం ఆమదాలవలస పట్టణం లోగల న్యూరాణీ మసీద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

–ఆమదాలవలస





అమ్మా.. ఇంత అవినీతా!

ఐదేళ్ల టీడీపీ పాలన అంతా అక్రమాల మయమేనా..

- టీడీపీ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిపై విరుచుకుపడుతున్న స్వపక్ష సభ్యులు
- టికెట్ పోరులో బయటపడుతున్న నాటి అక్రమాలు
- గుండ ఫ్యామిలీపై దుమ్మెత్తిపోసిన అసమ్మతి నేత పీవీ రమణ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

'టీడీపీ అధికారంలో ఉండగా హుద్ హుద్ ఇళ్లలో అవినీతికి పాల్పడ్డారు. టిడ్కో ఇళ్లలో అక్రమాలు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం డబ్బులు చేతులు మార్చారు. బదిలీల కోసం బల్ల కింద చేతులు పెట్టారు. ఇలా ఒకటేమిటి ఐదేళ్ల గుండ లక్ష్మీదేవి అమ్మ పాలన కోటరీ అవినీతి మయం కావడంతోనే 2019 ఎన్నికల్లో అమ్మ అవినీతిపై తీర్పు ఇచ్చారు.' ఈ వ్యాఖ్యలేమీ గుండ లక్ష్మి ప్రత్యర్థి పార్టీ వారు చేసినవి కావు.

–సాక్షాత్తు అదే పార్టీకి చెందిన పీవీ రమణ చేసినవి.

ఇప్పుడు ఈ వ్యాఖ్యలు ఆ పార్టీలో అగ్నిగుండాన్ని రాజేశాయి. మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణకు సోషల్ మీడియా ద్వారా ఈ ఘాటైన పదజాలాన్ని సంధించారు. ఇప్పటివరకు టిక్కెట్ కోసం ఒకరికొకరు విమర్శించుకున్నారే తప్ప ఏనాడు టీడీపీ అధికారంలో ఉండగా జరిగిన అక్రమాలను బయటపెట్టుకోలేదు. టిక్కెట్ పోరు తారాస్థాయికి చేరడంతో నాడు జరిగిన అవినీతి అక్రమాలన్నీ టీడీపీ నేతలే బయటపెట్టుకుంటున్నారు.

తాడోపేడో తేల్చుకునేలా..

శ్రీకాకుళం అసెంబ్లీ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికే ఇవ్వాలని ఒక వర్గం పట్టుబడుతుండగా, గొండు శంకర్‌కు ఇవ్వాలని మరో వర్గం డిమాండ్ చేస్తోంది. నియోజకవర్గ సమావేశాల్లోనూ, జిల్లా సమావేశాల్లోనూ నువ్వానేనా అంటూ తేల్చుకునేలా గొడవ పడుతున్నారు. ఈ పంచాయతీ చంద్రబాబు, లోకేష్ వరకు వెళ్లింది. పార్టీ అగ్రనాయకత్వంగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కూన రవికుమార్ గోడ మీద పిల్లి వాటంగా పంచాయతీ చూస్తున్నారు.

గొండు శంకర్‌కు తరచూ అవమానాలు

ఆ మధ్య జరిగిన పార్టీ మినీ మహనాడులో గుండ లక్ష్మీదేవి వర్గం పైచేయి సాధించింది. గొండు శంకర్‌కు వేదికపై స్థానం లేకుండా చేసింది. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా అభిమానుల సన్మానం విషయంలో కూడా గుండ లక్ష్మీదేవి వర్గమే పట్టు నిలుపుకుంది. ఇలా ప్రతి సారి గొండు శంకర్‌కు అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి. చెప్పాలంటే గొండు శంకర్ వర్గీయులకు అంత సీన్ లేదన్నట్టుగా తీసిపారేస్తున్నారు. దీంతో పార్టీ పరిశీలకుడిగా వచ్చిన చింతల రామకృష్ణ వద్ద గోడు వెళ్లబోసుకునేందుకు శంకర్ వర్గీయులు వందల సంఖ్యలో వచ్చారు. కానీ వారికి ప్రాధాన్యమివ్వలేదు. అంత మంది ఎందుకొచ్చారంటూ.. చివరికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సైతం గుండ లక్ష్మీదేవికి అనుకూలంగానే వంతపాడారు. చెప్పాలంటే పరిశీలకుడిని కలిసేందుకు వచ్చిన వారందరికీ చురక అంటించారు. దీంతో గొండు శంకర్ వర్గీయులో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈసారి ఏకంగా గుండ లక్ష్మీదేవిని టార్గెట్ చేసి, అధికారంలో ఉండగా చేసిన అవినీతి అక్రమాల చిట్టాను పీవీ రమణ ద్వారా విప్పారు.

సంచలనమే..

మొత్తానికి పీవీ రమణ సంధించిన అవినీతి, అక్రమాల అస్త్రాలను ఒక లేఖగా భావించాలో లేదంటే డైరెక్ట్ ఎటాక్‌గా భావించాలో గానీ శ్రీకాకుళం టీడీపీలో తాజా పరిణామాలు సంచలనంగా మారాయి. టికెట్ పోరులో టీడీపీ నేతల అసలు బాగోతం బయటపడుతోంది. అధికారంలో ఉండగా చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని తాజా ఆరోపణలతో తేలిపోయింది. ఈ పంచాయతీ ఎక్కడి వరకు వెళ్తుందో తెలీదు గానీ.. గతంలోని టీడీపీ ఐదేళ్ల పాలనలో శ్రీకాకుళం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయన్నది మాత్రం సుస్పష్టమవుతోంది.

గుండ ఫ్యామిలీని కడిగి పారేసిన వైనం

అవినీతి అక్రమాల గుట్టు రట్టు చేయడానికే పరిమితం కాలేదు. చివరికీ గుండ ఫ్యామిలీ రాజకీయాలతో బలైన చల్లా రవికుమార్, గేదెల రామారావు, దూడ భవానీ శంకర్, పైడిశెట్టి జయంతి, వైవీ సూర్యనారాయణ తదితర నాయకుల వివరాలను వెల్లడించారు. చివరికి భార్య చేతిలో అప్పల సూర్యనారాయణ సైతం చేతికానివారిగా మిగిలిపోయారని తను సంధించిన వ్యాఖ్యల్లో పీవీ రమణ ప్రస్తావించారు. 'మీ భార్యకు చంద్రబాబు టికెట్ ఇస్తే మీరు తిట్టిన తిట్లు పురాణం మరిచిపోయారా'? అని గుండ అప్పలసూర్యనారాయణకు గుర్తు చేసేలా వ్యాఖ్యానించారు. సూర్యనారాయణ టికెట్ కోసం గుండ లక్ష్మి ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు.

'అర్హులకు పథకం అందాల్సిందే'



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్హత ఉండి పథకం అందని వారు ఉండకూడదని, జూలై 1న చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ జగనన్న సురక్ష కార్యక్రమ నిర్వహణపై గురువారం సంబంధిత మండలాల అధికారులతో టెలీ కాన్ఫరెన్ నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని, వారికి పథకాలు అందుతున్నదీ లేనిదీ తెలుసుకోవాలని,వారికి కావాల్సిన 11 రకాల సేవలపై ఆరా తీయాలని సచివాలయ సిబ్బందిని, వలంటీర్లను సూచించారు. అర్హత ఉండి ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకం లబ్ధి పొందకుండా ఉండకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారన్నారు. శిబిరానికి ఎక్కువ మంది ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున వారికోసం మంచినీరు, స్నాక్స్, నీడ వంటి సౌకర్యాలను కల్పించడంతోపాటు వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు. శిబిరాలు నిర్వహించే తేదీలు, ప్రదేశాలు ముందుగా ప్రజలకు తెలియపరచాలన్నారు.సంబంధిత సెక్రటేరియట్‌లలో క్యాంపు షెడ్యూల్ తేదీకి 7 రోజుల ముందు కార్యకలాపాలు-అవగాహన ప్రచారాన్ని నిర్ధారించుకోవాలని తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంసిద్ధం కావాలన్నారు.

'మార్కులు పెరిగితే సమాచారం ఇవ్వాలి'

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 10వ తరగతి రీవాల్యుయేషన్‌లో మార్కులు పెరిగితే సమాచారం ఇవ్వాలని చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ నుంచి గురువారం ప్రకటన విడుదల చేశారు. జూలై ఐదో తేదీలోగా వర్సిటీ వెబ్‌సైట్‌లో మార్కుల వివరాలు అప్‌లోడ్ చేస్తే దరఖాస్తులు సవరణ చేసి, ప్రస్తుత మార్కులు ప్రవేశాలలో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం, నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు క్యాంపస్‌లు యూనిట్‌గా విద్యార్థులు ఇచ్చుకున్న ఆప్షన్లు ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు ఉంటాయని అన్నారు. వచ్చే నెల 5 నుంచి 9 వరకు ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరుగుతుందని చెప్పారు. కౌన్సెలింగ్ షెడ్యూల్ శుక్రవారం వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నట్లు తెలిపారు.

చిన్ని ప్రాణానికి ఆపద

- ఏడాదిన్నర బాలుడికి జీర్ణాశయ క్యాన్సర్
- ఆరోగ్య పరిస్థితి విషమం
- ఆపరేషన్‌కు రూ.30 లక్షల వరకు అవసరం
- దాతల సాయం కోరుతున్న తల్లిదండ్రులు



తల్లిదండ్రులతో దేవాన్ష

కోటబొమ్మాళి: తల్లి పొత్తిళ్లలో హాయిగా ఆడుకోవాల్సిన పసివాడు ప్రాణాల కోసం పోరాడుతున్నాడు. మల విసర్జన జరగక, కడుపు పొంగిపోయి నరకయాతన అనుభవిస్తున్నాడు. ఏడాదిన్నర వయసుకే క్యాన్సర్ సోకడంతో బాధ తాళలేకపోతున్నాడు. పిల్లాడి పరిస్థితి చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. ఆపరేషన్ చేయించే స్థోమత లేకపోవడంతో దాతల సాయం కోరుతున్నారు. తమ బిడ్డ ఆయుష్షు పెరగాలంటే మనసున్న వారు ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

కోటబొమ్మాళి మండలం తర్లిపేట పంచాయతీ చలమయ్యపేట కాలనీకి చెందిన జుత్తు సూర్యనారాయణ, అంజలి దంపతులకు నలుగురు సంతానం. మొదటి ఇద్దరు కూతుళ్లు కాగా తర్వాత మగపిల్లలు పుట్టారు. అందులో చివరి వాడు దేవాన్ష. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో దేవాన్షుకు ఒంట్లో నలతగా ఉండడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పిల్లాడిని పరీక్షించిన వైద్యులు ఆ బాలుడికి జీర్ణాశయ క్యాన్సర్ సోకిందని చెప్పడంతో తల్లిదండ్రుల గుండెల్లో రాయి పడింది. అప్పటి నుంచి శ్రీకాకుళం, విశాఖల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు తిరుగుతూనే ఉన్నారు. ఇంతలోనే 15 రోజుల కింద పిల్లాడికి మల విసర్జన మందగించింది. దీంతో కడుపు ఉబ్బిపోయింది. అప్పటి నుంచి పసివాడు ఊపిరాడక విలవిలలాడిపోతున్నాడు. వారం రోజుల కిందట విశాఖలోకి కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. కేన్సర్ కారణంగా జీర్ణాశయం అభివృద్ధి చెందడం లేదని, వెంటనే అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని చెప్పారు. అందుకు రూ.30 లక్షలు ఖర్చవుతాయని చెప్పడంతో ఆ డబ్బు ఎలా తీసుకురావాలో తెలీక తల్లిదండ్రులు మదనపడుతున్నారు. మంత్రి సీదిరి అప్పలరాజుకు విషయం చెప్పడంతో.. సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయాలని, తాను సిఫార్సు చేస్తానని తెలిపారు. అయితే ఓ వైపు పిల్లాడి వైద్యం, మరోవైపు కుటుంబ పోషణ వీరికి కష్టమైపోతోంది. ప్రస్తుతం దేవాన్ష ఆరోగ్యం విషమంగా ఉంది. దాతలు తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని కోరుతున్నారు.



సాయం చేయదలచుకున్న వారు 97003 82362 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు ట్రిపుల్ ఐటీలో టెక్నికల్ ఫెస్ట్



ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ)లో శుక్ర, శని వారాల్లో టెక్నికల్ ఫెస్ట్ ఎలక్ట్రావ్-2023 టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు చెప్పారు. ఎస్ఎం పురం క్యాంపస్‌లో గురువారం వివరాలు వెల్లడించారు. ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన ఆవిష్కరణలు, సాంకేతిక ప్రగతిపై ఈ ఫెస్ట్‌లో చర్చ జరుగుతుందని పేర్కొన్నారు.

1న డయల్ యువర్ యూనివర్సిటీ



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రతి నెల మొదటి శనివారం నిర్వహించే డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమం జూలై 1వ తేదీన నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.హెచ్.ఎ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. విశ్వవిద్యాలయం నుంచి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య ఉంటుందని, విద్యార్థులు 8247861919 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

క్లుప్తంగా

7న రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జూలై 7న ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేట్రన్లు, వైస్ పేట్రన్లు, కమిటీ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. రెడ్‌క్రాస్‌కు విరాళాలు అందించిన దాతలకు, శిబిరాల నిర్వాహకులకు, నేత్రదాతల కుటుంబ సభ్యులకు, రెడ్‌క్రాస్ వలంటీర్లకు అదే రోజున అవార్డుల ద్వారా సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఏపీ నెడ్‌క్యాప్ చైర్మన్



రాజుకు జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి/గార: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఏపీ నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు కుటుంబసమేతంగా గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆదిత్యున్ని తొలిసారి దర్శించుకోవడం సంతృప్తిగా ఉందని రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది చక్రవర్తి పాల్గొన్నారు. అనంతరం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని దర్శించుకున్నారు. ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు డబ్బీరు వాసుదేవరావు, పూడి కమల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్టోర్స్ ఔట్‌డోర్ ఇన్‌చార్జి ఏఈగా లక్ష్మి

అరసవల్లి: విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్ ఔట్ డోర్ ఇన్‌చార్జి బాధ్యతలను అక్కడే సబ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న లక్ష్మికి అప్పగిస్తూ సర్కిల్ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఔట్ డోర్ ఏఈగా పనిచేస్తున్న బి.రమాదేవిని అక్రమంగా స్టోర్ సామగ్రిని తరలించారన్న కారణంగా సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. లక్ష్మి శుక్రవారం ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించనున్నారు.

'అన్ని స్థానాల్లో పోటీచేస్తాం'



మాట్లాడుతున్న బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

టెక్కలి: మన పరిపాలన మన చేతికి వచ్చేలా రానున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో పోటీకు సిద్ధంగా ఉన్నామని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి అన్నారు. జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు ఆధ్వర్యంలో గురువారం టెక్కలిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీను బలవంతమైన శక్తిగా మార్చాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కోఆర్డినేటర్ బి.ప్రకాశరావు, కోడూరు కృష్ణమూర్తి, కృష్ణ యాదవ్, కె.మురళి, రుక్మాంగధరరావు, చింతాడ శ్రీనివాస్, చింతాడ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

ఆమదాలవలస : పట్టణంలోని కొత్తకోట వారి వీధికి చెందిన బొడ్డేపల్లి మానస (20) గురువారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానస ఇటీవలే కాకినాడ జేఎన్‌టీయూలో బీటెక్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. గురువారం ఏకాదశి కావడంతో తల్లిదండ్రులు ఆలయానికి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మానస ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఆలయం నుంచి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు తలుపులు తెరిచి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కుమార్తె కనిపించడంతో వెంటనే కిందకు దించి రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మానస మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమార్తె కడుపునొప్పి తట్టుకోలేక మృతిచెందినట్లు తండ్రి బొడ్డేపల్లి నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వై.కృష్ణ కేసు నమోదు చేశారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	58,960–00
బంగారం(22సి. 10గ్రా.)	54,050–00
వెండి (కిలో)	75,700–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹ 250

స్విచ్ ఆపేదేలే..!

- జిల్లాలో భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం
- మూడు నెలల్లో 423 మిలియన్ యూనిట్ల వాడం
- రూ.285.69 కోట్ల మేర విద్యుత్ బిల్లుల వసూలు
- వేసవి తాపం..ఉక్కపోతతో పెరిగిన విద్యుత్ డిమాండ్



అరసవల్లి:

జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ సర్కిల్ పరిధిలో ఈ వేసవి ప్రత్యేకంగా నిలిచింది. మూడు నెలలుగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో విద్యుత్ వినియోగం, డిమాండ్, కలెక్షన్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఎక్కడా కోతలు విధించవద్దని రాష్ట్ర ప్రభుత్వం అన్ని డిస్కంలకు (పంపిణీ సంస్థలు) ఆదేశాలు జారీ చేయడంతో సరఫరాలో కూడా పెద్దగా ఇబ్బందులు లేకుండా సర్కిల్ అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఏసీల వినియోగంతోనే ఈ రికార్డు స్థాయి వినియోగం జరిగిందనే అంచనాలున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం చూస్తే.. డిమాండ్ కంటే మించిన వినియోగం నమోదయ్యిందనే చెప్పాలి. గత ఏడాది ఇవే మూడు నెలల్లో 369 మిలియన్ యూనిట్ల వినియోగం కాగా... ఈసారి ఏకంగా 423 మిలియన్ యూనిట్లు వినియోగమైనట్లు నమోదయ్యింది. ఇది కొంతమేరకు ఆందోళనకరంగా అనిపించినా రానున్న రెండు మూడు నెలల పాటు విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా ఉంటుందని విద్యుత్ శాఖ ఇంజినీర్లు అంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం అన్ని కేటగిరీల విద్యుత్ కనెక్షన్లు 9.20 లక్షల వరకు ఉండగా, జిల్లాలో రోజువారీ విద్యుత్ వినియోగం సగటున 4.5 మిలియన్ యూనిట్లు వినియోగం ఉండేది. ఇప్పుడు ఏకంగా రోజుకు 6 మిలియన్ యూనిట్లు (60 లక్షల యూనిట్లు) మేర వినియోగించే పరిస్థితికి చేరింది.

మూడు నెలల్లో రూ.285.69 కోట్లు..

జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్ డిమాండ్ చోటుచేసుకుంది. అత్యధిక పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం విలవిల్లాడిపోయారు. దీంతో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదయ్యింది. ఎల్‌టీ వినియోగదారుల నుంచి ఈ మూడు నెలల్లో మొత్తం 258 మిలియన్ యూనిట్లు వినియోగం కాగా..విద్యుత్ బిల్లులుగా డిమాండ్ రూ.139.39 కోట్లు వరకు, హెచ్‌టీ వినియోగం 165.32 మిలియన్ యూనిట్లు కాగా, బిల్లుల డిమాండ్ రూ.146.30 కోట్లు వరకు చేరింది.

నెల	ఎల్‌టీ వినియోగం	బిల్లులు	హెచ్‌టీ వినియోగం	బిల్లులు(రూ.లలో)
మార్చి	77.07 ఎంయూ	39.32 కోట్లు	56.10	47.58 కోట్లు
ఏప్రిల్	85.82 ఎంయూ	44.52 కోట్లు	53.53	47.86 కోట్లు
మే	95.11 ఎంయూ	55.54 కోట్లు	55.69	50.85 కోట్లు



రికార్డు స్థాయిలో..



వేసవి నేపథ్యంలో సర్కిల్ పరిధిలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదైంది. ముందస్తు ప్రణాళికలతో ఇబ్బందులు లేకుండానే సరఫరా చేశాం. లోడ్ బ్యాలెన్సింగ్ చేసేలా చర్యలతో నాణ్యమైన విద్యుత్‌ను అందించాం. వినియోగదారులు స్వీయ నియంత్రణ పాటించాలి. అప్పుడే విద్యుత్ ఆదాతో పాటు మరింత ఉత్పత్తికి దోహదపడుతుంది. ముఖ్యంగా ఏసీల వినియోగం భారీగా పెరిగిపోవడంతో అధికంగా విద్యుత్ వినియోగం జరిగిందని గుర్తించాం.

– ఎల్.దైవప్రసాద్, ఎస్ఈ

కలెక్షన్ల వసూళ్లు పూర్తి..



వేసవి ప్రభావం ఉన్న మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎల్‌టీ వినియోగం భారీగా పెరిగిందని గుర్తించాం. హెచ్‌టీ వినియోగంతో కలుపుకుని 423.32 మిలియన్ యూనిట్ల వినియోగం ద్వారా రూ. 285.69 కోట్లు బిల్లుల డిమాండ్ చూపించింది. దీంతో కలెక్షన్లు కూడా వసూళ్లు చేసేలా చర్యలు చేపట్టాం. మార్చిలో ఎల్‌టీ వినియోగదారుల నుంచి డిమాండ్ రూ.39.32 కోట్లు ఉంటే..కలెక్షన్ రూ. 58.92 కోట్ల వరకు అయ్యింది. ఈ నెలలో అదనంగా ప్రభుత్వ భవనాల నుంచి పెండింగ్ చార్జీలను కూడా వసూలయ్యాయి.

– తాతాచార్యులు, సీనియర్ అకౌంట్స్ అధికారి

కేంద్రానికి సిఫారసుపై సీఎంకు కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న అంధవరపు సూరిబాబు

- కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్ర ప్రభుత్వం కళింగవైశ్యుల పరిస్థితులను అర్థం చేసుకుని సానుకూలంగా స్పందించి ఓబీసీలో చేర్పించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడం పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కళింగ వైశ్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోణార్క్ శ్రీను అన్నారు. శ్రీకాకుళం నగరంలోని క్లాత్స్ అండ్ మర్చంట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో కళింగవైశ్యులను ఓబీసీలో చేరుస్తామని హామీనిచ్చారని, ఆ దిశగా అడుగులు వేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని కళింగ వైశ్యులను ఓబీసీలో చేర్చేందుకు కళింగ వైశ్య ప్రతినిధి బృందం కొంతకాలంగా ప్రయత్నం చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ విషయమై గతంలో ఢిల్లీ కూడా వెళ్లామన్నారు. ఓబీసీ సాధనకు సంబంధించి జూన్ 22, 23 తేదీల్లో విజయవాడలో సంబంధిత బీసీ రాష్ట్ర అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. 2020 డిసెంబరు 17న కళింగ వైశ్యులను ఓబీసీలో చేర్పించాలని ప్రతిపాదిస్తూ కేంద్రానికి నివేదిక అందజేశామన్నారు. సమావేశంలో కళింగవైశ్య సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు ఊన్న నాగరాజు, అంధవరపు ప్రసాద్, ఎస్.వి.రమణ, గుడ్ల దామోదరరావు, సంతోష్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా బలివాడ



అసోసియేషన్‌లో ఎన్నికైన జిల్లా సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో గురువారం జరిగిన రాష్ట్ర సీనియర్ సిటిజెన్స్ యూనియన్ ఎన్నికలో జిల్లాకు చెందిన పలువురికి ప్రాతినిధ్యం లభించింది. జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా బలివాడ మల్లేశ్వరరావు, సంఘ సలహాదారుగా ఎంఎస్ఆర్ఎస్.ప్రకాశరావు, ఈసీ సభ్యునిగా కల్లేపల్లి సోమసుందరరావు, మహిళా విభాగం ఈసీ సభ్యులుగా జి.ఝాన్సీరాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా వెంపరాల నారాయణమూర్తి, జనరల్ సెక్రటరీగా రామచంద్రరావును ఏన్నుకున్నారు. సమావేశంలో జిల్లా సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.నరసింహమూర్తి, ఈసీ సభ్యులు బి.జయలక్ష్మి, పి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

70 మంది గంజాయి బ్యాచ్‌పై బైండోవర్?

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో గంజాయి వాడుతున్న 70 మందిని గుర్తించి వారికి 107 సీఆర్‌పీసీ కింద పోలీసులు బైండోవర్ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కొంతకాలంగా జిల్లాకేంద్రంగా గంజాయికి బానిసైన యువతే కాకుండా చిన్నచిన్న ప్యాకెట్ల ద్వారా క్రయ విక్రయాలు జరుపుతున్న 70 మందిని పోలీసులు గుర్తించారు. హయాతినగరం నుంచి బాదుర్లపేట వరకు (దమ్మలవీధి, గుడివీధి, మండలవీధి, గూనపాలెం, మహలక్ష్మినగర్, కలెక్టర్ బంగ్లా, ఏపీహెచ్‌బీకాలనీ, వాంబేకాలనీ, మసీదు తదితర ప్రాంతాలు) పోలీసులు రాత్రి గస్తీలతో పాటు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం రెండు బృందాలు మఫ్టీలో పెట్రోలింగ్ నిర్వహించి వ్యక్తులను గుర్తించినట్లు తెలిసింది. వీరందరికీ మరో రెండ్రోజుల్లో తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి బైండోవర్ కట్టనున్నట్లు సమాచారం.

న్యాయవాదులకు హెల్త్‌కార్డులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదుల హెల్త్‌కార్డులు పొందేందుకు ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ బార్ అసోసియేషన్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం 70 ఏళ్లలోపు ఉన్న న్యాయవాదులు కార్డు తీసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు.

• శేషపాన్పు అవతారంలో..

జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పాండ్రంగి వీధిలో స్వామివారు శేష పాన్పు అవతారంలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రదీప్‌శర్మ, ధర్మకర్త నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్



జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: జర్మనీ దేశంలో నర్సింగ్ ఉద్యోగాలు చేసేందుకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి బి.పి.సాయిశ్రీనివాస్ తెలిపారు. ఎచ్చెర్ల ఐటీఐలోని స్కిల్ హబ్‌లో గురువారం వివరాలు వెల్లడించారు. ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ, టీఏకేటీ ఇంటర్నేషనల్ సంస్థలు సంయుక్తంగా శిక్షణ ఇస్తా యని పేర్కొన్నారు. 20 నుంచి 35 ఏళ్ల వయస్సు, కనీసం రెండేళ్ల ఆస్పత్రిలో పనిచేసిన అనుభవం ఉన్నవారు అర్హులని చెప్పారు. జర్మన్ భాష తప్పనిసరిగా నేర్చుకునేందుకు, అక్కడ పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నర్సింగ్ గ్రాడ్యుయేట్ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. తాడేపల్లిలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో జూలై 1 నుంచి శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పారు. రెండు నెలల పాటు సెలవు రోజుల్లో మినహా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. జర్మన్ భాష మాట్లాడటంపై ప్రత్యేక తర్ఫీదు ఉంటుందన్నారు. హాస్టల్, డేస్ స్కాలర్లుగా తరగతులకు హాజరుకావచ్చునని, వసతి గృహంలో ఉంటే రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. పాస్‌పోర్టు అభ్యర్థులే సమకూర్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. భారతీయ కరెన్సీలో నెలకు రూ. 2.50 లక్షల వేతనం ఉంటుందని చెప్పారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9666322032, 9652503799నంబర్లను సంప్రదించాలని కోరారు.

అక్షరబ్రహ్మ ఆలయం ప్రారంభం



ఆలయాన్ని ప్రారంభిస్తున్న పాలకొండ ఎమ్మెల్యే కళావతి

కొత్తూరు: మండలంలోని కారిగూడ గ్రామంలో నిర్మించిన అక్షర బ్రహ్మ ఆలయాన్ని గురువారం పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రారంభించారు. ముందుగా ఆదివాసీ మహిళలు థింసా నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కళావతి, కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో అక్షరబ్రహ్మ ఆలయాలు నిర్మించే విషయమై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కారిగూడ సర్పంచ్ సవర లోది, మాజీ సర్పంచ్ అప్పారు, చక్రపాణి, పాలకొండ ఏఎంసీ చైర్మన్ హిమరక మోహనరావు, నాగేంద్ర, తులాల తులసి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో ఉమ్మడి సీనియారిటీకి ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మురళీమోహనరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఉమ్మడి సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా పీఆర్‌టీయూ కార్యాలయంలో గురువారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈవో–1, ఉప విద్యాశాఖాధికారి, డైట్ లెక్చరర్ల పోస్టులను ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయాలని కోరారు. 302 జీవోను రద్దు చేసి 225 జీవో ప్రకారం స్కూల్ అసిస్టెంట్లను జేఏల్స్‌గా పదోన్నతులు చేపట్టాలని, జిల్లా పరిషత్‌కు సమానంగా మున్సిపల్ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో కూడా +2 (ఇంటర్ కోర్సులు) విధానాన్ని అమలు చేయాలని విన్నవించారు. 6, 7, 8 తరగతులు ఉన్న ప్రతి యూపీ పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలని కోరారు. డీఈఓ పూల్‌లో ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను హెచ్‌ఎంలు లేని స్కూళ్లలో నియమించాలన్నారు. బదిలీల కారణంగా ఉపాధ్యాయుల జీతాలలో తలెత్తిన సమస్యలను జిల్లా ట్రెజరీ అధికారులు సరిచేయాలని విన్నవించారు. అంతకుముందు పీఆర్‌టీయూ రాష్ట్ర స్థాయి నాయకులు భైరి అప్పారావు, పప్పల రాజశేఖరరావు సమక్షంలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా ప్రతినిధులు బత్తుల రవికుమార్, దానేటి కేశవరావు, బాబూరావు, హరిశ్చంద్రుడు, యోగానంద్, సీతరాజు, రమేష్ పాణీగ్రహి, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి గిరిజన కుటుంబాలు



మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో పార్టీలో చేరిన గిరిజనులు

మందస: సాబకోట పంచాయతీ నువాగాం గ్రామానికి చెందిన 25 గిరిజన కుటుంబాలు గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. రాష్ట్ర పశు సంవర్థక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మంత్రి అప్పలరాజు ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు గిరిజనులు తెలిపారు. సర్పంచ్ సవర సంధ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సవర రాము, బమ్మిడి బాలరాజు, లొద్దక మోహనరావు, ఖగేష్, గోవర్ధన్, నిమ్మన విశ్వనాథం, శత్రుఘ్నన, సవర శశి, నిఖిత పాల్గొన్నారు.

వ్యవసాయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న వ్యవసాయశాఖ అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వ్యవసాయ శాఖలో వివిధ కేడర్లలో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, గ్రామ వ్యవసాయ సహాయకుల క్రమబద్ధీకరణ సత్వరం పూర్తిచేయాలని ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళం నగరంలో ఓ హోటల్లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ ఏఓ, ఏడీఏలకు రవాణా, మౌలిక సదుపాయాల కల్పన, కొత్తగా ప్రారంభవవుతున్న సమీకృత వ్యవసాయ ప్రయోగశాలల్లో సిబ్బంది నియామకం చేపట్టాలని కోరారు. సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షుడు పెద్దపాళ్యం పాపయ్యనాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు బత్తిన రంగనాథ్, ప్రధాన కార్యదర్శి బాలంకారి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి బండ్రెడ్డి సాయి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొడవంటి జగన్మోహనరావు, బుడుమూరు వెంకట తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

జూడోలో సౌమ్యారాణికి స్వర్ణం



సౌమ్యారాణికి స్వర్ణ పతకం అందజేస్తున్న డీఎస్‌ఏ బి.వి.ప్రసాదరావు

గార: మండలంలోని వాడాడ గ్రామంలో గురువారం శ్రీ తరణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన 66వ జాతీయ పాఠశాల చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో జూడో విభాగంలో కడపల సౌమ్యారాణి విజేతగా నిలిచింది. పలు విభాగాల్లో పోటీలు నిర్వహించగా విజేతలకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సీఈవో బి.వి.ప్రసాదరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మండ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్రాంత పోల్వాల్ట్ క్రీడాకారులు ఖాసింఖాన్ దంపతులు, హెచ్‌ఎం వేణుగోపాల్, కోచ్ మణికుమార్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



రాములమ్మ (ఫైల్)

రణస్థలం: మండలంలోని సంచాం పంచాయతీ పెసరపాలెం గ్రామానికి చెందిన పెసల రాములమ్మ(57) పిడుగుపాటుకు గురై మృతి చెందింది. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెసరపాలెం సమీపంలో కొబ్బరి కమ్మలు ఏరుకునేందుకు తోటకు వెళ్లిన రాములమ్మపై మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో పిడుగు పడింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. తోటి మహిళలు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. ఉదయం ఉపాధి పనికి వెళ్లి వచ్చిన తరువాత మధ్యాహ్నం కొబ్బరి కమ్మలు ఏరుకోవడానికి వెళ్లినట్లు తోటి మహిళలు చెబుతున్నారు. రాములమ్మకు భర్త రమణ, నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరికి వివాహాలయ్యాయి. భర్త రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జి రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీ యువతులపై దాడి కేసులో వ్యక్తికి రిమాండ్

ఆరిలోవ: విశాఖపట్నం జిల్లా ఆదర్శనగర్‌లోని లాడ్జీలో థాయ్‌లాండ్ యువతులపై దాడి చేసిన వ్యక్తిని ఆరిలోవ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 8న లాడ్జిలో ఉన్న థాయ్‌లాండ్‌కు చెందిన ఇద్దరు యువతులు, విశాఖకు చెందిన మరో యువతిపై పాతపట్నం మండలం యశోదనగర్‌కు చెందిన సురవరపు మహేష్ చేయిచేసుకున్నాడు. దీంతో వారు సీపీకి ఫిర్యాదు చేయడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు లాడ్జీలో తనిఖీలు చేపట్టారు. అక్కడి నుంచి పరారైన మహేష్‌ను రెండు రోజుల తర్వాత శ్రీకాకుళం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే ఆత్మహత్యాయత్నాకి పాల్పడిన మహేష్‌ను అక్కడ పోలీసులు ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. ఆరోగ్యం కుదుటపడటంతో బుధవారం శ్రీకాకుళం నుంచి విశాఖ తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. కోర్టు రిమాండ్ విధించడంతో విశాఖ కేంద్ర కారాగారానికి తరలించామన్నారు. నిందితుడిపై గతంలోనూ పలు కేసులు నమోదైనట్లు సీఐ వెల్లడించారు.